క్లుప్తంగా

నేడు 6, 7 వార్డుల్లో 'గడప గడపకు'

పాలకొండ: నగర పంచాయతీలోని 6, 7 వార్డుల పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ శాఖల, సచివాలయాల సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేత్రదానంపై అవగాహన సదస్సు



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అంధత్వ నివారణ అధికారి సుకుమార్‌బాబు

కురుపాం: స్థానిక సీహెచ్‌సీ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి ఆధ్వర్యంలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అంధత్వ నివారణ అధికారి డా. సుకుమార్‌బాబు మాట్లాడుతూ నేత్రదానం చేసి అంధులకు చూపునివ్వాలని, ఒకరు నేత్రదానం చేస్తే ఇద్దరికి అంధులకు చూపును ప్రసాదించే భాగ్యం కలుగుతుందన్నారు. అనంతరం నేత్రవైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మౌనిక, సహాయకులు శైలజ, రోజా, మల్లిక, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మకు బంగారు మంగళసూత్రాల వితరణ



కోటదుర్గమ్మ అమ్మవారికి మంగళ సూత్రాలను అందజేస్తున్న నారాయణశెట్టి వరం కుటుంబ సభ్యులు

కురుపాం: మండల కేంద్రంలోని రావాడ కూడలిలో వెలసిన కోటదుర్గమ్మ అమ్మవారికి స్థానిక వ్యాపారి నారాయణశెట్టి వరం కుటుంబ సభ్యులు శ్రావణ మాసం సందర్భంగా రూ.20 వేల విలువ గల బంగారు మంగళసూత్రాలను వితరణగా ఆలయ అర్చకులు శ్రీనువాసనాయికోకు శుక్రవారం అందజేశారు. వీటిని అమ్మవారికి అలంకరణకు వినియోగించాలని కోరారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



తుమ్మిగూడలో పారిశుద్ధ్య పనులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వనకాబడి పంచాయతీ దిగువ దేరువాడ, తుమ్మిగూడ, ఎగువ దేరువాడ గ్రామాల్లో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ముఖ్యంగా కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారాలు తొలగించడం, గ్రామాల్లోని తాగునీటి పథకాల్లో క్లోరినేషన్, వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో ఏఎల్‌ఓ పౌడర్ చల్లడం వంటి పనులు చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు.

బడి బయట పిల్లలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంఈఓ - 2 శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: బడి బయట పిల్లలపై దృష్టి సారించాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎంఈఓ – 2 శ్రీనివాసరావు సూచించారు. ఎంఈఓ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. బడి బయట పిల్లలు ఒక్కరు కూడా ఉండరాదని, అటువంటి వారు ఉంటే సమాచారం అందించాలని అన్నారు. గతంలో గుర్తించిన పిల్లలు బడిలో చేరారా లేదా, లేక ఏదైనా పనిలో చేరారా తెలియపరచాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి అటువంటి వారు చదవకపోవడానికి కారణాలు తెలపాలన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

శ్రావణ వైభోగం

కురుపాం: మండల కేంద్రంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా రావాడ కూడలిలో ఉన్న కోటదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమ పూజలను నిర్వ హించారు. ఆలయ అర్చకులు శ్రీనువాస్‌నాయికో అమ్మ వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యల మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

గరుగుబిల్లి: శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం సందర్భంగా మండలంలోని రావుపల్లిలో గల శ్రీ సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అంపోలు వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, కుంకుమ పూజలను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

- పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం
- పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

పాలకొండ: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన చేస్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పట్టణ పరిధిలోని 3, 5 వార్డులలో గల ఎన్‌కే రాజపురం, గాయత్రినగర్ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు ఇంటింటికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో ఇంతవరకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యేకు హారతులు పట్టి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ద్వారా పొందుతున్న లబ్ధితో తాము సంతోషంగా ఉన్నామని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఎక్కడా రాజకీయ వివక్షత లేకుండా పథకాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు నీలాపు శారద, వెలమల మన్మధరావు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, నగర పంచాయతీ మేనేజర్ జయరాం, సచివాలయ సిబ్బంది, కౌన్సిలర్లు, ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి శ్యామల

కొమరాడ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు పక్కాగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ అధికారులంతా మూడు నెలలకొకసారి నిర్వహించే మండల సమావేశానికి గైర్హాజరవడం శోచనీయమన్నారు. ఏనుగుల గుంపు సంచరిస్తున్న గ్రామాల్లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ చాటింపు వేయాలని కోరారు. ఒంటరి ఏనుగు విషయమై అటవీ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ముంపు బారిన పడ్డ పొలాలన వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కేంద్రక అన్నపూర్ణ, శివిని పీఏసీఎస్ అధ్యక్షుడు పప్పల గోపాలకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐటీ నోటీసులతో బాబు బండారం బట్టబయలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యత్నం
- అల్లర్లు సృష్టించేందుకు కుట్ర
- అరెస్టు చేస్తారంటూ మొసలి కన్నీరు
- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న చంద్రబాబు ప్రజలను ఇంకా మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ధ్వజమెత్తారు. పాలకొండలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరును వివరించారు. రూ.118 కోట్ల ప్రజాధనం కాజేసిన వైనం వెలుగులోకి రావడంతో చంద్రబాబుకు మతి భ్రమించిందని తెలిపారు. ఐటీ నోటీసుల నేపథ్యంలో తనను అరెస్టు చేస్తారంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడం ద్వారా లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిగా పదవిలో ఉండగా ప్రజలకు ఏమి చేసారో చెప్పలేని స్థితి ఉన్న చంద్రబాబు ఇప్పుడు ప్రజలకు చెప్పేది లేక అల్లర్లు సృష్టించి లబ్ధి పొందాలని చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు వెలమల మన్మధరావు, పార్టీ నాయకులు రౌతు హనుమంతరావు, నీలాపు శ్రీనివాసరావు, కడగల రమణ, తుమ్మగుంట శంకరరావు, తూముల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిపై ఫిర్యాదు



సీతంపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న ఏఎంసీ చైర్మెన్, ఎంపీపీ

సీతంపేట: టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారునాయక్‌పై పాలకొండ ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, ఎంపీపీ బి.ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు జి.సుమిత్రారావు తదితరులు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరపై టీడీపీ నాయకుడు చేసిన ఆరోపణలు సత్య దూరంగా ఉన్నాయన్నారు. నిరాధారంగా చేసిన ఆరోపణలు గిరిజన తెగల మధ్య వైరుధ్యాలుపెంచుతాయన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా దారునాయక్ చేసిన ఆరోపణలు నేర ప్రవృత్తి, దురుద్దేశపూర్వకంగా ఉన్నాయన్నారు. గిరిజనాభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రిపై ఇటువంటి ఆరోపణలు తగవన్నారు. టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిపై పోలీసు కేసు నమోదు చేయాలన్నారు. ఫిర్యాదును ఎస్‌ఐ నీలకంఠరావుకు అందజేశారు. ఎంపీటీసీ చంద్రశేఖరరావు, సర్పంచ్ వెంకునాయుడు, పార్టీ నాయకులు సింహాచలం, అబ్బాస్, రవి పాల్గొన్నారు.

నేటి నుంచి హిందీ ప్రచార సభ పరీక్షలు

కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ప్రచార సభ పరీక్షలు శనివారం నుంచి జరగనున్నట్లు కేంద్ర వ్యవస్థాపకులు సంతోష్‌కుమార్ పండా తెలిపారు. శని, ఆదివారం రెండు రోజులు జరిగే విశారద, భూషణ్, విద్వాన్ పరీక్షలకు చీఫ్‌గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట శంకరావు, డీఓగా మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ వ్యవహరిస్తారన్నారు.

జీవామృతంతో పంటలకు జీవం

గరుగుబిల్లి: జీవామృతంతో పంటలకు జీవం వస్తుందని ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని నందివానివలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలకు సూక్ష్మ, స్థూల పోషకాలను అందించేందుకు జీవామృతం ఎంతో దోహదం చేస్తుందన్నారు. పంటలు పండించిన సమయంలో మూడు నుంచి ఐదుసార్లు ఎకరానికి 200లీటర్లు జీవామృతాన్ని పిచికారీ చేస్తే పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో రైతులు తమ యొక్క వ్యవసాయ క్షేత్రాల్లో జీవామృతం తయారు చేసుకోవడానికి సిమెంట్ కుండీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా సీఐఎఫ్ రుణంతో కుట్టుమిషన్లు పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఎంపీపీ కుంబురుక దీనమయ్య అన్నారు. మండలంలోని కేదారిపురం గ్రామంలో గల ధనలక్ష్మీ గ్రామైక్య సంఘానికి చెందిన ఐదుగురు మహిళా సభ్యులు కుట్టు మిషన్ల కోసం సీఐఎఫ్ రుణం కోరగా, వైకేపీ అధికారులు ఒక్కొక్కరికీ రూ.10వేల చొప్పున్న రుణాన్ని మంజూరు చేస్తూ, కుట్టు మిషన్లకు సమకూర్చారు. ఈమేరకు శుక్రవారం లబ్ధిదారులైన మహిళ సభ్యులకు ఎంపీపీ కుట్టు మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తులసమ్మ, వైస్ సర్పంచ్ అభిమన్యు, మాజీ ఎంపీటీసీ పసుపురెడ్డి మహేష్, వైకేపీ సీసీ పైడా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



నూతన పింఛను అందజేస్తున్న వైస్ ఎంపీపీ, పార్టీ మండల కన్వీనర్ సూర్యప్రకాష్

పాలకొండ రూరల్: వర్షాలు విస్తారంగా కురుస్తున్న క్రమంలో గ్రామీణ ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూసేందుకు సచివాలయాల సిబ్బంది అందుబాట్లో ఉండాలని వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్ అన్నారు. లుంబూరు, ఓని, పనుకువలస, ఎల్‌ఎల్.పురం గ్రామాల సర్పంచులతో కలసి సచివాలయాలను శుక్రవారం సందర్శించారు. వర్ష ప్రభావంతో పొలాల్లో నీరు చేరటం, విద్యుత్ సమస్యలు, తాగునీటి ఇబ్బందులపై ఆరా తీశారు. సంబంధిత సిబ్బంది సచివాలయాల ద్వారా పంచాయతీల్లో చోటుచేసుకుంటున్న ఇబ్బందులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అధిక వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందించారు. ఆయన వెంట సర్పంచులు ఎస్.మంగామణి, కె.మంజుభార్గవి, కె.రవణమ్మ తదితరులున్నారు.

నాగావళి నదిలో జలకళ



అన్నవరం - అంపిలి గ్రామాల సమీపంలో నాగావళి నదిలో వర్షపు నీరు

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనంగా కారణంగా కురుస్తున్న వర్షాలకు పట్టణ, మండల పరిధిలో గెడ్డలు, వాగులు, చెరువుల్లో పుష్కలంగా వర్షపు నీరు చేరింది. ఇదిలా ఉంటే నిన్న మొన్నటి వరకు సాగునీటికి ఇబ్బందులు పడుతున్న శివారు ప్రాంతాల వరి భూముల్లో వర్షపు నీరు చేరటంతో పంట భూములు చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా రావాడ, పోతులగెడ్డకు నీరు పోటెత్తడం, కొండవాలు నీరు దిగువకు చేరటంతో మండలంలోని భాసూరు, కోటిపల్లి, చింతాడ, తుమరాడ, రాజుపేట, తంపటాపల్లి తదితర గ్రామాలకు చెందిన వరి, తంపర భూములు నీట మునిగాయి. మండలంలోని గోయిదాపేట, చిన్న, పెద్ద మంగళాపురం, గోపాలపురం, అన్నవరం, అంపిలి గ్రామాలను అనుసరించి ప్రవహిస్తున్న నాగావళి నదిలో జలకళ సంతరించుకుంది. నదిలో నీటి ప్రవాహం పెరగటంతో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా వ్యవహ రించాలని రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణసాయితేజ

పాలకొండ రూరల్: విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకుంటూ నేరపూరిత, అసాంఘిక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, పాలకొండ సివిల్ కోర్టు జడ్జి కృష్ణ సాయితేజ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో న్యాయవిజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా దిశ చట్టంపై బాలికలకు వివరించారు. ఎస్‌ఐ బి.శివప్రసాద్ మా ట్లాడుతూ యువత ఉన్నత మార్గాలను ఎంచుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. తప్పులు చేసి, కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్తులో అనేక సమస్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.కృష్ణమూర్తి, హెచ్‌ఎం ఎం.సూర్యనారాయణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వర్షాలతో ఆందోళనక్కర్లేదు..

- వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు రత్నకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

పాలకొండ రూరల్: విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రస్తుతం వరి పంటలకు వచ్చిన నష్టం ఏమీ ఉండదని, ఆందోళన అవసరం లేదని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కె.రత్నకుమారి అన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు అధ్యక్షతన శుక్రవారం ఏఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్ష ప్రభావంతో నీట మునిగిన పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సచివాలయ వ్యవసాయ సహాయకులు ద్వారా రైతులకు అవసరమైన సహకారం క్షేత్ర స్థాయిలో అందిస్తున్నామన్నారు. ఈ – క్రాప్ నమోదు తాజా పరిస్థితిపై ఏఓ ఎన్ని వాహిని వివరించారు. రైతులు తప్పనిరిగా ఈ – క్రాప్ చేయించుకోవాలన్నారు. తద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన పెంచుకొని సద్వినియోగపర్చుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, పలు పంచాయతీలకు చెందిన రైతులు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.





నిలిచిన నీటితో రాకపోకలకు అవస్థలు

కొమరాడ: కూనేరు రైల్వేస్టేషన్ సమీపంలో సరుగుడుగూడ గ్రామానికి వెళ్లే రహదారిపై మూడో రైల్వేలైన్ కింద ఉన్న బ్రిడ్జి వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. దీన్ని మళ్లించకుండా రైల్వే అధికారులు అలా విడిచిపెట్టేయండంతో నీరు నిల్వ ఉండి ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఉలిపిరి పంచాయతీ సరుగుడుగూడ గ్రామం వైపు ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీని వల్ల అటువైపు గిరి శిఖర సుమారు 12 గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదని సీపీఎం మండల కన్వీనర్ కొల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో గిరిజనులు కూనేరు రైల్వేస్టేషన్ మాస్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వైద్య సేవల విషయంలో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రైల్వే అధికారులు తక్షణమే స్పందించి నీటిని మళ్లించే చర్యలు చేపట్టాలని కోరారు.



బ్రిడ్జి వద్ద చేరిన వర్షపు నీటిలో రాకపోకలు ఇలా...

అర్హులందరికీ పింఛన్లు



కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

కురుపాం: అర్హత గల ప్రతీ ఒక్కరికి పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత అన్నారు. పంచాయతీ పరిధిలో కొత్తగా మంజూరైన 23 పింఛన్లను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందివ్వటమే ప్రభుత్వ లక్ష్యమని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కురుపాం గ్రామ సర్పంచ్ గార్ల సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొదంగోళ్ల గౌరీశంకరరావు, ఎంపీటీసీలు వెలమల బంగారు నాయుడు, టి.వి.ఎస్.స్వామియాజులు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట వెంకటసురేష్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జిలాని, రాయిపిల్లి శ్రీధర్, కమిడి భూషణరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ వారికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు సూచించారు. ఎల్విన్‌పేట రైతుభరోసా కేంద్రం వద్ద వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం చిన్నారావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఖరీఫ్ పంటకు సంబంధించి ఈ – క్రాప్ నమోదు మరియు ఈకేవైసీ ప్రొగ్రస్, పీఎం కిసాన్ ఆధార్ సీడింగ్ కాని రైతులకు ఆధార్ సీడింగ్, కుటుంబ సభ్యులకు మ్యుటేషన్, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా 80 శాతం రాయితీపై మినుములు, పెసలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించేందుకు తగు చర్యల కోసం చర్చించారు. సలహా మండలి చైర్మన్ చిన్నారావు మాట్లాడుతూ రైతులకు ప్రస్తుత ఖరీఫ్ పంటకు సంబంధించి వరి పైరుపై తరచూ విచ్చేసే తెగుళ్లపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ సకాలంలో నివారణ చర్యలు చేపట్టేందుకు వీఏఏలు, వీహెచ్‌ఏలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రత్యేకంగా ప్రకృతి వ్యవసాయంలో మోడల్ క్లస్టర్ల ఎంపిక మరియు విధి విధానాలను చేపట్టడంలో ప్రత్యేక చొరవ కనబర్చాలని కోరారు. డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా మాసపత్రిక నిర్వాహకులు, వ్యవసాయాధికారి కె.ఆంజనేయకుమార్ మాట్లాడుతూ 30 సంవత్సరాలు దాటిన జీడిమామిడి తోటలకు కొమ్మల కత్తిరింపులు, పాత తోటలను కొత్తగా పునరుద్ధరణ చేయడం, కొత్త రకాల అధిక ఉత్పత్తికి హైబ్రిడ్లతో పాత తోటలకు అంటుకట్టడం, జీడిమామిడి ప్రాసెసింగ్ యూనిట్లు ఎఫ్‌పీఓల ద్వారా ఏర్పాటు చేయడం గూర్చి వివరించారు. సమావేశంలో ఏపీసీఎన్ఎఫ్ మోడల్ మండల్ టీం లీడర్ వై.గణేష్ శరత్ చంద్ర, మండల వ్యవసాయాధికారి సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

